అన్నివర్గాల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అక్కమ్మ చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

నందిగామ: రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడ శివారులోని అక్కమ్మ చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో గురువారం చేపపిల్లలను వదిలారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల సమసయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్, జిల్లా ఫిషరీస్ అధికారి పూర్ణిమ, మాజీ సర్పంచ్ కావలి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహ యాదవ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, కుమారస్వామిగౌడ్, అశోక్, శంకరయ్య, రవీందర్, యాదగిరి, చందన్, శేఖర్, మత్స్యకార సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కొత్తూరు: ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఏనుగుమడుగుతండాలో గురువారం లింగబసవేశ్వర, ఆంజనేయస్వామి నూతన ఆలయాల నిర్మాణాల కోసం నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు. దైవచింతన ఏర్పరుచున్న వారు ఇతరుల పట్ల ప్రేమానురాగాలతో మెలుగుతారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రభాకర్, గోవింద్, చందర్, శ్రీనివాస్‌నాయక్, హన్మంతు, నరేశ్‌నాయక్, గ్రామస్తులు, పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం

ఎంపీడీఓ అపర్ణ

షాబాద్: మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ప్రజ్వల ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణలతో కలిసి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు. పేద, మధ్య తరగతి, వలస కార్మికుల అమ్మాయిలు, మహిళలు ఎక్కువగా మోసాలకు గురవుతున్నారన్నారు. ఉద్యోగం, ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారన్నారు. యుక్త వయసు బాలికలు ఎక్కువ మొత్తంలో మోసపోతున్నారన్నారు. అనంతరం ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ (సైబర్ ట్రాఫికింగ్) అనేది చాలా వేగంగా విస్తరిస్తోందన్నారు. పిల్లలకు ఫోన్ ఉపయోగించడం ద్వారా వచ్చే నష్టాలను వివరించారు. ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాను ఆదిలో అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించు కోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ టీచర్ తమ పరిధిలోని విద్యార్థులకు అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజ్వల సంస్థ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సురేశ్‌కుమార్, సిబ్బంది అంబర్‌సింగ్, మితాశిరాజ్, కేశవ్, మండల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



మానవ అక్రమ రవాణా నిర్మూలన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ అపర్ణ, తదితరులు

క్లుప్తంగా

అవసరమైన పనులను ఎంపిక చేయండి



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

కొందుర్గు: ఉపాధిహామీ పథకంలో అవసరమైన పనులను ఎంపిక చేసి ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు. రైతులకు సంబంధించి భూముల చదును, వాలుకట్టలు, ఫారమ్‌ఫండ్, రైతుల పంట పొలాలకు వెళ్లడానికి దారుల ఏర్పాటు వంటి పనుల కోసం గ్రామస్తులందరూ కలిసి చర్చించి తీర్మానం చేయాలని సూచించారు. ప్రజల అవసరాలు తీరడంతో పాటు కూలీలకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈసీ లక్ష్మారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలో వడ్ల కృష్ణయ్య బుధవారం రాత్రి అకస్మాత్తుగా మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు రూ.10వేల 500ల ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో జంగారెడ్డి, రమేశ్‌గౌడ్, కోటీశ్వర్, శ్రీనివాస్, రమేశ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు



మాట్లాడుతున్న రాజు, నాయకులు

కొందుర్గు: పదేండ్లు ఎమ్మెల్యేగా ఉన్న అంజయ్యయాదవ్ జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చేసిన అభివృద్ధి ఏమిటో తెలపాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి రాజు ప్రశ్నించారు. గురువారం చౌదరిగూడలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. పేరుకే చౌదరిగూడ మండలం చేశారే తప్పా.. ఒక్క ప్రభుత్వ భవనం నిర్మించింది లేదన్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కనీసం రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన రేషన్‌కార్డులే ఇంకా ఉండటం సిగ్గుచేటన్నారు. ఒక్క పేదోడికి పక్కా ఇల్లు కట్టించారా చెప్పాలన్నారు. సర్పంచ్‌లకు బిల్లులు ఇవ్వలేదని బీఆర్‌ఎస్ నాయకులకు అధికారంలో ఉన్న సమయంలో గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు బిల్లులు రాలేదని చెప్పడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆంజనేయులు, సలీం, వెంకటనర్సింహారెడ్డి, ఎజాజ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పట్టణంలోని జానంపేటలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 20న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు, భక్తులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జమృద్‌ఖాన్, గంధం ఆనంద్, వీరేశం, శివయ్య, బీరప్ప, శ్రీశైలం, లక్ష్మీనర్సింహ, పల్లి శేఖర్, వీరేశం, సంపత్, మహేందర్, శివరాజ్, గోపాల్, రవి కుమార్, వెంకటేశ్, సాయి, రాజు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



పూజల్లో పాల్గొన్న మాజీఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: మనదేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలో బీహార్, ఉత్తరప్రదేశ్, గుజరాత్‌కు చెందిన ఉత్తర భారతీయులు ఛట్ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన దేశ సంస్కృతి సంప్రదాయాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రపంచదేశాలకు మన సంస్కృతి సంప్రదాయలు ఆదర్శనీయమన్నారు. ఛట్‌పూజలో భాగంగా మహిళలు ఉదయం నుంచి ఉపవాస దీక్షను చేపట్టి సాయంత్రం చెరువు వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఉపవాస దీక్షను విరమిస్తారని పేర్కొన్నారు. ప్రజలందరూ సంతోషంగా జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్.నటరాజ్, కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి(చింటూ), నాయకులు చెట్ల నర్సింలు, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, అద్దు, రవి యాదవ్, గుండు అశోక్, గుడ్డు యాదవ్, సల్ల మహేశ్, బాబషోరీ, నవీన్, శివ, శ్రీకాంత్, రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లకురుమలు ఆర్థికంగా ఎదగాలి

మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్



సదర్ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

మొయినాబాద్: గొల్లకురుమలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కాశీనాథ్ గ్రౌండ్‌లో బుధవారం రాత్రి సదర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. పూర్వం నుంచి గొల్లకురుమలకు ఘనమైన చరిత్ర ఉందన్నారు. గొల్ల కురుమలు పశువులను పూజించే క్రమంలోనే దీపావళి తర్వాత సదర్ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సదర్ వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు రూ.1కోటి కేటాయించిందని, కానీ అవి ఏమూలకు సరిపోవన్నారు. రూ.100కోట్ల నిధులు ఇచ్చి సదర్ వేడుకలను అధికారికంగా నిర్వహించాలన్నారు. గొల్లకురుమలు అన్ని రకాల ఎన్నికల్లో పోటీచేసి గెలవాలని, రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. గొల్లకురుమలు చదువులో వెనకబడిపోతున్నారని, పిల్లలను చదివించి ఉత్తములుగా తీర్చిదిద్దాలన్నారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం మాట్లాడుతూ.. నీతి, నిజాయితీకి మారుపేరు గొల్లకురుమలు అన్నారు. మోసం చేయడం, మాటతప్పడం గొల్లకురుమలకు తెలియదన్నారు. ఈ సందర్భంగా దున్నపోతుల ఊరేగింపు, విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్, యాదవ మహాసభ నేతలు లడ్డు యాదవ్, చిన్న శ్రీశైలంయాదవ్, గుంటి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీకాంత్, మాజీ వైస్ ఎంపీపీ సామ మాధవరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్, మాజీ సర్పంచ్ రాజు, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి రమేశ్‌యాదవ్, రాష్ట్ర నాయకులు సుధాకర్‌యాదవ్, నవీన్‌యాదవ్, జగ్గయాదవ్, జిల్లా అధ్యక్షుడు బర్ల జగదీశ్‌యాదవ్, ఉపాధ్యక్షులు రవీందర్‌యాదవ్, యాదగిరియాదవ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్, మండల అధ్యక్షుడు బైకని చెన్నయ్యయాదవ్, నిర్వాహకులు సుధీర్‌యాదవ్, మహేందర్‌యాదవ్, అశోక్‌యాదవ్, సురేశ్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రవియాదవ్, మహేందర్‌ముదిరాజ్, మధుసూదన్‌రెడ్డి, శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛట్ పూజలు



కొత్తూరులో సూర్యభగవానుడికి పూజలు నిర్వహిస్తున్న ప్రజలు

కొత్తూరు: పట్టణంలో గురువారం ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఒడిసా, బీహార్ రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఛట్ పూజను ఘనంగా నిర్వహించారు. దీపావళీ తర్వాత కార్తీక మాసం ప్రారంభంలో ప్రతి ఏటా ఈ వేడుకలను నిర్వహించడం వారి ఆనవాయితీ. పూజల్లో భాగంగా కుటుంబంలోని పురుషులు బాగుండాలని మహిళలు ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. ఇందులో భాగంగా వివిధ రకాల పండ్లు, పూలు, తినుబండారాలు తయారు చేసి నదులు, చెరువుల వద్ద సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తారు. మరుసటిరోజు ఉదయం పూజలు నిర్వహించి ఉపవాస దీక్షలు విరమిస్తారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..



కొందుర్గులో ఛట్‌పూజలో పాల్గొన్న ఉత్తర భారతీయులు

కొందుర్గు: మండల కేంద్రంలోని తుప్పగూడెం చెరువు వద్ద గురువారం ఛట్‌పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ తదితర ఉత్తర భారతదేశానికి చెందిన వారు వివిధ పనుల రీత్యా కొందుర్గులో నివసిస్తున్నారు. వారు ప్రతిఏటా కార్తీక మాసంలో సూర్య భగవానుడికి ఛట్ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులందరూ చెరువు శివారులో సూర్య నమస్కారాలు చేశారు.

మొక్కజొన్న సాగుపై అవగాహన

కేశంపేట: షెడ్యూల్ తెగల ఉపప్రణాళిక పథకంలో భాగంగా మండల పరిధిలోని గుట్టల గడ్డతండాలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం వారు గ్రామస్తులకు రైతులకు మొక్కజొన్న సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు మొక్కజొన్న సాగు పద్ధతులను వివరించారు. అనంతరం రైతులకు ఉచితంగా విత్తనాల ప్యాకెట్లతో పాటు కలుపు మందును అందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఎస్ఎల్ జూట్, డాక్టర్ నగేశ్ కుమార్, సునీల్, మల్లయ్య, లక్ష్మి, సౌజ న్య, వాణి, పరమేశ్వరి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు వినయ్, రాజేశ్వరి, తదితరులుపాల్గొన్నారు.



దేవాలయాల పరిరక్షణకు కృషిచేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న బాబయ్య, అనంతయ్య

షాద్‌నగర్‌రూరల్: పురాతన దేవాలయాల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి గురువారం మున్సిపల్ 13వ వార్డు కౌన్సిలర్ కానుగు అనంతయ్య రూ.25వేల విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని బాబయ్య చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాబయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగువుతున్న పురాతన దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకొని భగవన్నామ స్మరణ చేయాలని సూచించారు. సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ప్రధానంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, పిల్లి యాదయ్య, నరహరి, శేఖర్, జీటీ.మోహన్, అందె రఘు తదితరులు పాల్గొన్నారు.

దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

బజరంగ్‌దళ్ విభాగ్ కన్వీనర్ రమేశ్

షాబాద్: రాష్ట్రంలో హిందూ దేవుళ్లపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నా అరికట్టడంలో ప్రభుత్వం, పోలీస్‌శాఖ విఫలమైందని బజరంగ్‌దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ముత్యాలమ్మ దేవాలయం, మరువక ముందే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ కాలనీ ఆంజనేయస్వామి దేవాలయంలో నవగ్రహాలను పగలగొట్టారన్నారు. వారంరోజుల వ్యవధిలో హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా హిందూ దేవుళ్లపై నిందితులు దాడి చేసినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. మతిస్థిమితం లేని వాళ్లు పగులగొట్టారని అని పోలీసులు స్టేట్‌మెంట్లు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. మతిస్థిమితం లేని వాళ్లకు కేవలం హిందూ దేవాలయాలు మాత్రమే కనిపిస్తున్నాయా అని విమర్శించారు. నిందితులు ఎవరైనా వారిని మీడియా ముందుకు తీసుకురావాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని మండల కేంద్రాల్లో ఉన్నటువంటి దేవాలయాల దగ్గర స్థానికులతో కలిసి సీసీకెమెరాలను ఏర్పాటు చేసి, పోలీసుశాఖ వారు పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. వరుసగా హిందూ దేవుళ్లపై దాడులు జరుగుతున్నా దేవదాయ శాఖ, మంత్రి, సీఎం కనీసం మాట్లాడకపోవడం బాధాకరమన్నారు.

ఉచిత వైద్య శిబిరం



నర్సప్పగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న జిమ్స్ వైద్యబృందం

నందిగామ: మండల పరిధిలోని నర్సప్పగూడలో జిమ్స్ ఆస్పత్రి, హోమియో కళాశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రపంచ మధుమేహం వ్యాధి వారోత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా మధుమేహంతో బాధపడే వారి కోసం వైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిమ్స్ డాక్టర్ విరాజ్ హాజరై పలువురు వైద్య విద్యార్థులతో గ్రామస్తులకు మధుమేహం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విరాజ్ మాట్లాడుతూ.. రోగి ప్రీ డయాబెటిక్ దశలో ఉన్నట్లయితే ఏ విధంగా దానిని నివారించాలో, ఒక వేళ డయాబెటిక్ వ్యాధి ఉన్నట్లయితే ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనంతరం జిమ్స్ డాక్టర్ల బృందం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 60 మందికి పైగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందు అశోక్‌కుమార్, డాక్టర్లు గీత, దివ్య, వైద్య విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన బి.వెంకట్రామ్‌ను బీఆర్‌ఎస్ నాయకులు మున్సార్ అలీ, బర్కత్ అలీ, ఆరీఫ్‌లు గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపలాలిటీలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

శంకర్‌పల్లి: గ్రామాలు, పట్టణాలు అనే తేడాలేకుండా ఫోన్ల వినియోగం ఎక్కువ అవడంతో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలపై సైబర్ దాడులు చేస్తున్నారని ఎంజీఐటీ(మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మహారాజ్‌పేట గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వారంరోజుల పాటు స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేశారు. గురువారం కళాశాల విద్యార్థులు గ్రామంలో సైబర్ నేరాలు, మహిళా సాధికారతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని, ఆఫర్ల పేరుతో మోసం చేస్తున్నారన్నారు. కొత్త నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, లింక్స్‌కి ఎటువంటి సమాచారం ఇవ్వొద్దని సూచించారు. మహిళలు ఆధునిక యుగంలో అనేక రంగాల్లో రాణిస్తున్నారని, గ్రామాల్లోని మహిళలు సైతం తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని విజయం సాధిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.బాల్‌రెడ్డి, అధ్యాపకులు డా.రవిచందర్, ఎ.అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంజీఐటీ విద్యార్థులు